క్లుప్తంగా

పౌష్టికాహారంతో ఆరోగ్యం



మాట్లాడుతున్న సీడీపీఓ దేవకుమారి

బుచ్చినాయుడుకండ్రిగ : అంగన్‌వాడీ కేంద్రాల్లో పంపిణీ చేస్తున్న పౌష్టికాహారం భుజిస్తే గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ఆరోగ్యంగా ఉంటారని సీడీపీఓ దేవకుమారి తెలిపారు. మంగళవారం కనమనంబేడులో పౌష్టికాహార పక్షోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ 22వ తేదీ వరకు పౌష్టికాహార పక్షోత్సవాలు చేపట్టాలని ఆదేశించారు. 1000 రోజుల సంరక్షణ, తృణ ధాన్యాలతో ఉపయోగం, మాల్ న్యూట్రీషన్, చిన్నపిల్లలు తీసుకోవలసిన ఆహారం, తదితర విషయాలను గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు యమున, జ్యోతి, కార్యకర్తలు సుదర్శన, ప్రమీల, కృష్ణవేణి, రామలక్ష్మి పాల్గొన్నారు.

నాగలాపురంలో..



మాట్లాడుతున్న సీడీపీఓ శోభారాణి

నాగలాపురం: స్థానిక బీసీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార పక్షోత్సవాలను మంగళవారం ప్రారంభించారు. సీడీపీఓ శోభారాణి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందించాల్సిన పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ శ్రీదేవి, అంగన్‌వాడీ టీచర్ సావిత్రి పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న ప్రధానోపాధ్యాయుడు రమణయ్య

బుచ్చినాయుడుకండ్రిగ : స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలోని ఇంటర్ విద్యార్థినులకు ప్రభుత్వం సరఫరా చేసిన పుస్తకాలను మంగళవారం పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు రమణయ్య మాట్లాడుతూ ఒక్కో విద్యార్థినికి 12 నోటు పుస్తకాలు చొప్పున పంపిణీ చేశామని, త్వరలో పాఠ్య పుస్తకాలను అందిస్తామని వెల్లడించారు.

సచివాలయం ఏర్పాటుపై విచారణ



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని కారణి పంచాయతీలో సచివాలయం ఏర్పాటుపై మంగళవారం ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు విచారణ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ కంచనపుత్తూరు, కారణి, నెరిణీకండ్రిగపంచాయతీలకు కంచనపుత్తూరులో గ్రామ సచివాలయం ఉందని వెల్లడించారు. అయితే అధికారికంగా కారణిలో సచివాలయం ఉన్నట్లు నమోదైందన్నారు. దీనిపై సర్పంచ్ పద్మమ్మ కారణి గ్రామంలోనే సచివాలయం ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి కార్యాలయంలో ఫిర్యాదు చేశారని వెల్లడించారు. సీఎంఓ ఆదేశాల మేరకు విచారణ చేపట్టినట్లు తెలిపారు. ఈ మేరకు నివేదిక సిద్ధం చేసి సీఎంఓకు పంపనున్నట్లు వివరించారు.

ఫైలేరియా బాధితులకు కిట్లు పంపిణీ



కిట్లు అందిస్తున్న డాక్టర్ అరుణ్‌కిషోర్

సత్యవేడు: దాసుకుప్పం పీహెచ్‌సీ పరిధిలోని 18 మంది బోదకాలు(ఫైలేరియా) బాధితులకు కిట్‌లను డాక్టర్ అరుణ్ కిషోర్ మంగళవారం పంపిణీ చేశారు. ఈ మేరకు కిట్‌ల వినియోగించే విధానంపై అవగాహన కల్పించారు. శరీరంలో వ్యాధి సోకిన భాగాన్ని శుభ్రం చేసి డ్రెస్సింగ్ చేసుకోవాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమలు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. దోమ తెరలు వాడితే మరింత ప్రయోజనకరమని తెలిపారు. అనంతరం ఆశ వర్కర్లకు యూనిఫామ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఓ ఎస్.సుబ్రమణ్యం, ఆశ నోడల్ అధికారి నాగజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన స్థలాన్ని కాపాడండి

- దురాక్రమణకు యత్నిస్తున్న వైనం
- కలెక్టర్‌ను ఆశ్రయించిన దళితులు
- శ్మశానాన్ని పరిశీలించిన తహసీల్దార్ సురేష్ బాబు



కబ్జాకు గురవుతున్న శ్మశాన వాటిక

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): గత 30 ఏళ్లుగా ప్రభుత్వ భూమిని అప్పటి తహసీల్దార్ సూచనల మేరకు శ్మశాన వాటికలా వినియోగిస్తున్నారు. కానీ ప్రస్తుతం పక్కనే ఉన్న కడపకు చెందిన భూ పట్టాదారుడు ఈ శ్మశాన వాటికను కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారంటూ గురవరాజు పల్లి దళితవాడ ప్రజలు వాపోతున్నారు. రేణిగుంట మండలం గురవరాజుపల్లి దళితవాడకు సంబంధించిన 42/12 సర్వే నెంబర్లో గల ఒక ఎకరా 7 సెంట్ల శ్మశాన వాటి



గ్రామస్తులతో చర్చిస్తున్న తహసీల్దార్ సురేష్ బాబు

కను గత వారం కబ్జా చేసేందుకు కడపకు చెందిన కొందరు ప్రయత్నించగా గ్రామస్తులు అడ్డుకున్నారు. ఇదే విషయంపై సోమవారం తిరుపతి జిల్లా కలెక్టర్‌ను దళితవాడ ప్రజలు కలిసి తమ సమస్యను వివరించారు. స్పందించిన కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ రేణిగుంట తహసీల్దార్‌కు సమస్యను పరిష్కరించాలని ఆదేశాలు ఇచ్చారు. అందులో భాగంగా మంగళవారం ఉదయం తహసీల్దార్ సురేష్ బాబు, ఆర్ఐ జయకృష్ణ, వీఆర్వో శంకరయ్య దళితవాడకు చెందిన శ్మశాన వాటికను పరిశీలించారు. శ్మశాన వాటిక సమస్యపై గ్రామస్తులు తహసీల్దార్‌కు వివరించారు. సానుకూలంగా స్పందించిన తహసీల్దార్ సర్వే చేయించి గ్రామానికి వేరుగా, దళితవాడకు వేరుగా శ్మశాన వాటిక హద్దులను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

సర్వే చేసి సమస్యను పరిష్కరిస్తాం

కలెక్టర్ ఆదేశాల మేరకు గురవరాజు పల్లి దళితవాడ శ్మశాన వాటికను పరిశీలించాం. పూర్తి స్థాయిలో సర్వే చేసి గ్రామస్తులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటాం.

– సురేష్ బాబు, తహసీల్దార్, రేణిగుంట

రాత్రి సమయాల్లో కబ్జాకు ప్రయత్నం



గత వారంలో రాత్రి సమయాల్లో జేసీబీలు తీసుకొని వచ్చి శ్మశానాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. రాత్రి సమయాల్లో శ్మశానాన్ని కాపలా కాయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. న్యాయం చేస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు. హామీని నెరవేర్చాలని కోరుతున్నాం.

– శ్రీనివాసులు, దళితవాడ, గురవరాజుపల్లి

కలెక్టర్‌కు విన్నవించాం



దళితవాడకు చెందిన శ్మశానాన్ని కబ్జాకు యత్నించిన వారిపై గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాం. స్పందించిన కలెక్టర్ తహసీల్దార్‌ను శ్మశాన వాటిక వద్దకు పంపించారు. సర్వే చేసి న్యాయం చేస్తామని తహసీల్దార్ తెలిపారు. శ్మశాన వాటికకు హద్దులు ఏర్పాటు చేసి శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నాం.

– వీరస్వామి, దళితవాడ, గురవరాజుపల్లి

ఆశావర్కర్లకు వేతనం పెంచాలి



వినతిపత్రం అందిస్తున్న ఆశావర్కర్లు

వరదయ్యపాళెం: ఆశావర్కర్లను మెడికల్ ఉద్యోగులుగా గుర్తించి వేతనం పెంచాలని, నెలకు కనీసం రూ. 26వేలు చెల్లించాలని ఏఐటీయూసీ మండల కార్యదర్శి వాణి డిమాండ్ చేశారు. మంగళవారం ఈ మేరకు ఆశావర్కర్లతో కలిసి చిన్న పాండూరు పీహెచ్‌సీ వైద్యాధికారి లావణ్యకు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించాలని కోరారు. రోజుకు 8 గంటల పని విధానం కొనసాగించాలన్నారు. పని భారం తగ్గించాలని విన్నవించారు.

అందరి సహకారంతో అభివృద్ధి

వరదయ్యపాళెం: కేవీబీపురం మండలంలో అందరి సహకారంతో అభివృద్ధి పనులు చేపడతామని ఎమ్మెల్యే ఆదిమూలం తెలిపారు.మంగళవారం మండలంలోని కోటా మంగాపురం, వగత్తూరులో నూతనంగా నిర్మించిన సిమెంటు రోడ్లను ప్రారంభించారు. పశువుల దాహార్తి తీర్చేందుకు నిర్మించనున్న నీటి తొట్టెల పనులకు భూమిపూజ చేశారు. అనంతరం పలువురు మహిళలకు పొజిషన్ సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ క్రమంలోనే రైతులకు రాయితీపై పనిముట్లు అందజేశారు.

ఉద్యమాలు మరింత ఉధృతం చేస్తాం

శ్రీకాళహస్తి : భవిష్యత్తు ఉద్యమ కార్యక్రమాలను ఉధృతం చేస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య అన్నారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో మంగళవారం సీపీఎం ప్రాంతీయ కమిటీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మే 1న మే డే, సుందరయ్య జయంతి, 19న సుందరయ్య వర్ధంతి నిర్వహణకు ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. మే 8, 9, 10న తిరుపతి వేమన విజ్ఞాన కేంద్రం వేదికగా సీపీఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు నిర్వహించనున్నట్లు స్పష్టం చేశారు. ఆరు నెలలు–ఆరు కమిటీల నినాదంతో పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేయనున్నట్లు తెలిపారు. అనంతరం సీపీఎం రాష్ట్ర కమిటీ సమావేశాల కరపత్రాలను ఆవిష్కరించారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

సీపీఎం శ్రీకాళహస్తి ప్రాంతీయ కమిటీ కార్యదర్శి గంధం మణి, రెడ్డిపల్లి సురేష్, రాధమ్మ, రమణయ్య, వెంకటేష్, గురునాథం, మనోహర్, రాజా తదితరులు పాల్గొన్నారు.

షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం జిల్లా కమిటీ ఎన్నిక

ఏర్పేడు (రేణిగుంట): ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం జిల్లా కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా అంబేడ్కర్ స్టార్‌కృష్ణ, జనరల్ సెక్రటరీగా డాక్టర్ ఈ.గోపి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా డాక్టర్ ఎం.ప్రసాద్‌రావు, ట్రెజరర్‌గా జి.రాజేష్‌తోపాటు మరికొంతమంది నాయకులను ఎన్నుకున్నారు. తిరు పతి అంబేడ్కర్ భవన్ చైర్మన్, సంఘం రాష్ట్ర సలహాదారు డాక్టర్ పి.పరమశివన్ సమక్షంలో ఈ కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ విక్రమ్‌కుమార్‌రెడ్డిని నూతన కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. అంబేడ్కర్ జయంతికి ప్రభుత్వం నుంచి అదనపు నిధులు వచ్చేవిధంగా చర్యలు చేపట్టాలని కోరినట్టు వారు పేర్కొన్నారు.



డైరెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం జిల్లా కమిటీ సభ్యులు

సకాలంలో పన్నులు చెల్లించండి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పురపాలకసంఘ పరిధిలో 2025–26వ ఆర్థిక సంవత్సరానికి చెల్లించాల్సిన ఇంటి పన్నులు, ఖాళీ జాగా పన్నులను సకాలంలో చెల్లించి 5 శాతం రాయితీ పొందాలని కమిషనర్ గిరికుమార్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 30వ తేదీలోపు చెల్లించాలని తెలిపారు. ఆదివారం కూడా ప్రత్యేక కౌంటర్ల ద్వారా చెల్లించవచ్చని చెప్పారు. ఉదయం 7 గంటల నుంచి రాత్రి 8 గంటల్లోపు పన్నులు చెల్లించి పురపాలక సంఘం అభివృద్ధికి ప్రజలు సహకరించాలని కోరారు.

మధ్య తరగతికి అండగా ముద్రా రుణాలు

శ్రీకాళహస్తి: కేంద్రం ప్రభుత్వం తీసుకువచ్చిన ముద్రా రుణాలు మధ్యతరగతి వ్యాపారులకు అండగా నిలుస్తాయని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చంద్రప్ప అన్నారు. ముద్రాలోన్ ప్రారంభించి పదేళ్లు అయిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం ప్రారంభమైనప్పటి నుంచి 2024 మార్చి వరకు దాదాపు రూ.37.76కోట్లు రుణాలను మంజూరు చేసినట్లు తెలిపారు. మధ్య తరగతి వ్యాపారులు దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు కండ్రిగ ఉమ, ఉమాసింగ్, అరుణ, ప్రియాంక, మమత, గీతా తదితరులు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న కారు



ప్రమాదానికి కారణమైన కారు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): మద్యం మత్తులో కారును డ్రైవింగ్ చేస్తూ ఎదురుగా వస్తున్న ఆటోని ఢీకొనడంతో ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలైన ఘటన రేణిగుంటలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం.. రేణిగుంట పాత చెక్‌పోస్ట్‌లో మంగళవారం సాయంత్రం ఆటోను తిరుపతి నుంచి పుత్తూరు వైపు వెళ్లే కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఆటో డ్రైవరుకు తీవ్ర గాయాలయ్యాయి. రేణిగుంట సీఐ శరత్‌చంద్ర కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. గాజుల మండ్యంకు చెందిన పవన్ కారును మద్యం మత్తులో డ్రైవింగ్ చేసినట్లు నిర్ధారణకు వచ్చారు. ఆపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



మాజీ మంత్రి పెద్దిరెడ్డికి పరామర్శ

నారాయణవనం: మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని మంగళవారం తిరుపతిలోని ఆయన నివాసంలో పలువురు ప్రముఖులు పరామర్శించారు. చేతికి గాయమైన విశ్రాంతి తీసుకుంటున్న పెద్దిరెడ్డిని ఎంపీ గురుమూర్తి, వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్, హైకోర్ట్ విశ్రాంత జడ్జి దొరస్వామి, పార్టీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి రాకేష్ కిరణ్, బీరేంద్ర, ఎంపీటీసీ సభ్యుడు రవి, నారాయణ వనం మండల నేతలు పీజీ బాబు, గోవిందస్వామి తదితరులు కలిశారు.

వరదయ్యపాళెం: సత్యవేడు నియోజకవర్గంలోని కేవీబీపురం, బీఎన్‌కండ్రిగ, వరదయ్యపాళెం మండలాలకు చెందిన పలువురు వైఎస్సార్‌సీపీ నేతలు మంగళవారం తిరుపతిలోని నివాసంలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్, మండల కన్వీనర్లు గవర్ల కృష్ణయ్య (కేవీబీపురం), నాయుడు దయాకర్ రెడ్డి (వరదయ్యపాళెం), ఉమ్మడి చిత్తూరు జిల్లా మహిళా అధ్యక్షులు బొర్రా మాధవి, లాల్‌బాబు యాదవ్, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఉగుమూడి గురునాథం, భానుప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు.



పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో నూకతోటి రాజేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు

అనధికార బార్ల వీరంగం

నాగలాపురం: పట్టణంలో అనధికార బార్లు బరితెగిస్తున్నాయి. నిబంధనలు తుంగలో తొక్కి అనుమతులు లేకుండా మద్యం విక్రయిస్తున్నాయి. అయినా సంబంధిత ఎక్సైజ్, పోలీసు అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. పట్టణంలోని బైపాసు రోడ్డులో ఉన్న ఫైవ్‌స్టార్ వైన్ షాపు వద్ద అనధికారికంగా ఓ బార్ అండ్ హోటల్ కొనసాగుతోంది. సోమవారం రాత్రి కొంతమంది మందుబాబులు ఆ అనధికార బార్‌లో వీరంగం సృష్టించారు. సప్లై చేసే వ్యక్తిపై దాడికి తెగబడ్డారు. ఆపై అక్కడ ఉన్న ప్లాస్టిక్ కుర్చీలను పగులగొట్టారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడికి చేరుకున్నారు. మందుబాబులు పోలీసులతో వాగ్వాదానికి దిగినా పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. అధికార పార్టీ నేతలకు చెందిన ఈ అనధికార బార్ వల్ల మందుబాబులతోపాటు తాము ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు.

నవధాన్యాలతో భూమికి సారం

నారాయణవనం: నవధాన్యాల సాగుతో భూసారం పెరుగుతుందని, పంటల దిగుబడిని అధికంగా సాధించవచ్చునని ప్రకృతి వ్యవసాయ క్షేత్ర సిబ్బంది సూచించారు. మంగళవారం మండలంలోని సముదాయం రైతు సేవా కేంద్రంలో మహిళా రైతుల సమావేశం నిర్వహించారు. క్షేత్ర సిబ్బంది నిరోష, సుహాసిని మాట్లాడుతూ రసాయన ఎరువులు, పురుగు మందులు వాడితే భూసారం దెబ్బతింటుందన్నారు. చీడపీడలు, తెగుళ్ల నివారణకు ప్రకృతి విధానంలో సాగు చేపట్టాలని సూచించారు. సూక్ష్మ పోషకాలతో భూమి సారవంతమవుతుందని వివరించారు.

యానాదివెట్టులో గ్రామసభ

వరదయ్యపాళెం: మండలంలోని యానాదివెట్టులో చేపట్టిన రీసర్వేపై మంగళవారం గ్రామ సభ నిర్వహించారు. తహసీల్దార్ రాజశేఖర్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ ప్రసాదరావు హాజరై రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. తహసీల్దార్ మాట్లాడుతూ రీసర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. భూముల వివరాలను రీసర్వే అధికారులకు అందించాలని కోరారు. భూ సమస్యల పరిష్కారానికి రీసర్వే ఉపయోగపడుతుందని వెల్లడించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ రమణయ్య, విలేజ్ సర్వేయర్ హేమంత్, వీఆర్ఓ చలపతి పాల్గొన్నారు.



రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

వైభవంగా వసంతోత్సవం

వరదయ్యపాళెం: మండలంలోని పెద్ద పాండూరులోని శ్రీకోదండరామస్వామి ఆలయంలో నవమి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం వైభవంగా వసంతోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. సీతారాముల ఉత్సవమూర్తులను ఊరేగించారు. ఆలయ ప్రధాన అర్చకుడు నిరంజనాచార్యులు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.



మోటార్ సైకిల్ దొంగకు రిమాండ్

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): గాజుల మండ్యం పోలీస్ స్టేషన్ పరిధిలో మోటార్ సైకిల్‌ని దొంగతనం చేసి పరారీలో ఉన్న వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు. పోలీసుల కథనం.. రాపూరు మండలానికి చెందిన వై.ప్రసాద్ (23) గతంలో రేణిగుంట మండలం, గాజులమండ్యం పోలీస్ స్టేషన్ పరిధిలో మోటార్ సైకిల్ దొంగతనం చేశాడు. దీంతో అతనిపై కేసు నమోదైంది. పరారీలో ఉన్న అతను మంగళవారం రేణిగుంట సంత గేటు వద్ద ఉన్నట్టు గుర్తించి అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

కుటుంబంపై బండ బాదుడు దారుణం



శ్రీకాళహస్తి: నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

శ్రీకాళహస్తి: పెరిగిన నిత్యావసర ధరలకు తోడు గ్యాస్, పెట్రోలు, డీజిల్ ధరలు పెంచడం ద్వారా ప్రతి కుటుంబంపై మోదీ ప్రభుత్వం అదనపు భారాన్ని మోపనుందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. పెంచిన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలకు వ్యతిరేకంగా స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద సీపీఎం నేతలు మంగళవారం నిరసన తెలిపారు. ఇప్పటికే విద్యుత్, నిత్యావసర ధరలు పెరిగి అల్లాడుతున్న దేశ ప్రజానీకంపై అదనపు భారం మోపిన మోదీ గుది బండగా మారారంటూ విమర్శించారు. కార్పొరేట్ల ప్రయోజనాల కోసమే పాకులాడుతున్నారని మండిపడ్డారు. నాయకులు గంధం మణి, రెడ్డిపల్లి సురేష్, రమణయ్య, వెంకటేష్, గురునాథం, రాధమ్మ, మనోహర్, కుమార్, రాజా, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ ధర పెంపుపై నిరసన

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): వంట గ్యాస్‌పై రూ.50 పెంపును నిరసిస్తూ మంగళవారం రేణిగుంట మండలం తారక రామ్‌నగర్ లో రేణిగుంట మండల సీపీఎం నాయకులు నిరసన చేపట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వారు మాట్లాడుతూ దేశ ప్రజలను మభ్యపెట్టి మూడోసారి బీజేపీ అధికారంలోకి వచ్చి నిత్యావసర సరుకులు, వంట గ్యాస్ ధరలు పెంచుతూ సామాన్యులపై అధిక భారం వేస్తోందన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు హరినాథ్, రాజశేఖర్, శివానందం, సత్యశ్రీ, దీప సెల్వరాజ్, ప్రశాంత్, హేమంత్, ప్రభావతి పాల్గొన్నారు.

'బండ' బాదుడు దారుణం

సత్యవేడు : పేదలు సైతం నిత్యావసరంగా వినియోగించే వంట గ్యాస్ బండ ధర పెంచడం దారుణమని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దాసరి జనార్దన్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. ఉచితంగా గ్యాస్ సిలిండర్లు ఇస్తామని చెప్పి రూ.50 బాదడం అన్యాయమని మండిపడ్డారు.

పారిశుద్ధ్య పనులు ముమ్మరం

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని కనమనంబేడు గ్రామంలో జ్వరపీడితులు ఎక్కువ కావడంతో పారిశుద్ధ్య పనులను ముమ్మరంగా చేపట్టారు. మంగళవారం ఈ మేరకు ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు, సర్పంచ్ జనార్దన్, కార్యదర్శి వెంకటసుబ్బయ్య పర్యవేక్షణలో మురుగునీటి కాలువలను శుభ్రం చేసి, వీధుల్లో బ్లీచింగ్ చల్లారు. దోమల నివారణకు ఫాగింగ్ చేయించారు. ఇళ్ల వద్ద చెత్తను తొలగించారు. తాగునీటి ట్యాంకును శుభ్రం చేయించి, క్లోరినేషన్ చేయించారు. తాగునీటి పైపులైన్ లీకేజీలు లేకుండా సరిచేశారు. ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు మాట్లాడుతూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. వారంలో రెండు రోజులు మురుగునీటి కాలువలను క్లీన్ చేయాలని, వీధుల్లోనీటి నిల్వలేకుండా చూడాలని కార్యదర్శి వెంకటసుబ్బయ్యను ఆదేశించారు.

ఉచిత వైద్య శిబిరం

కనమనంబేడులో స్థానిక పీహెచ్‌సీ వైద్యులు విద్యాసాగర్ సిబ్బందితో కలసి ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. జ్వరాల బారిన పడిన వారి రక్తనమూనాలు సేకరించి, ల్యాబ్‌కు పంపించారు. రోగులకు వైద్య పరీక్షలు చేసి ఎంపీడీఓ చేతులమీదుగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్ఓ వెంకటేశులు పాల్గొన్నారు.





రోగులకు మందులు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు, మురుగు తొలగిస్తున్న కార్మికులు

వేడుకగా ఊంజల్‌సేవ



ఊంజల్ సేవ నిర్వహిస్తున్న అర్చకుడు

నారాయణవనం : పద్మావతీదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పంగుణోత్తర ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు మంగళవారం సాయంత్రం అమ్మవారికి వేడుకగా ఊంజల్‌సేవ నిర్వహించారు. అనంతరం సర్కారు అభిషేకం జరిపించారు. ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. ఈ క్రమంలోనే పద్మావతీదేవిని విశేషంగా అలంకరించి తిరుచ్చి వాహనంపై కొలువుదీర్చారు. ఆలయ అంతర ప్రాకారంలో ఊరేగించారు. ఊంజల్ మండపంలోని ఊయలపై సిరులతల్లిని అధిష్ఠింపజేశారు. కనులపండువగా ఊంజల్ సేవ చేపట్టారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్, ప్రధాన అర్చకులు శ్రీధరభట్టాచార్య, శ్రీనివాసరాఘవ భట్టాచార్య, నరసింహరాఘవ భట్టాచార్యులు పాల్గొన్నారు.